క్లుప్తంగా

పోస్టల్ బీమా పాలసీలను వినియోగించుకోవాలి

పోస్టల్ శాఖ ఏపీ సర్కిల్ హెడ్ ఎస్.ప్రకాజ్ శివమణి



ప్రత్తిపాడు: పోస్టల్ బీమా పాలసీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ శాఖ ఏపీ సర్కిల్ హెడ్ ఎస్.ప్రకాజ్ శివమణి తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన బత్తుల రాజశేఖర్ కొద్ది నెలల కిందట విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. రాజశేఖర్ పోస్టల్ శాఖకు చెందిన రూ.399లతో గ్యాగ్ పాలసీని చేయించుకుని ఉన్నాడు. దీంతో పోస్టల్ నిబంధనల ప్రకారం ప్రమాద బీమా కింద మృతుని కుటుంబానికి రూ.10 లక్షలు అందాయి. ఈమేరకు మృతుడి భార్య వాణికి చెక్కును స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పోస్టల్ శాఖ ఏపీ సర్కిల్ హెడ్ ఎస్.ప్రకాజ్ శివమణి అందజేశారు. పోస్టల్ నరసరావుపేట బ్రాంచి మేనేజర్లు మహేష్‌రెడ్డి, శివ, గుంటూరు సౌత్ సబ్ డివిజన్ ఐపీఓ మునిచంద్రారెడ్డి, గొట్టిపాడు బీపీఎం శ్రీహర్ష పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం



ప్రత్తిపాడు: అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. వట్టిచెరుకూరు మండలం కుర్నూతలకు చెందిన ముద్రబోయిన నాగేశ్వరరావు స్థానిక రామాలయం సెంటరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం స్పెషల్ బ్రాంచి సిబ్బందికి అందింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ కోటేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి దాడి చేసి, అతని వద్ద నుంచి 20 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నాగేశ్వరరావుపై ఎక్సైజ్ యాక్టు కింద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సెబ్ ఎస్ఐ గీతపై విచారణ



ప్రత్తిపాడు: స్థానిక సెబ్ స్టేషనులో ఎస్ఐ గీతపై వచ్చిన అవినీతి ఆరోపణలపై మంగళవారం ఆశాఖ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించారు. గత ఏడాది అక్రమ మద్యం కేసులో ప్రత్తిపాడుకు చెందిన యర్రాకుల భాస్కర్ అనే వ్యక్తి నుంచి రూ. 30 వేలు లంచం తీసుకోవడంతో పాటు అతనిపై కేసులు నమోదు చేశారు. దీంతో బాధితుడు ఆశాఖ ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో సెబ్ ఏఈఎస్ దుర్గాప్రసాద్ విచారణ జరిపారు. బాధితుడు భాస్కర్‌ను సెబ్ స్టేషనుకు పిలిపించి విచారించి, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎస్ఐ గీతపై వచ్చిన ఫిర్యాదుపై విచారించేందుకు ఇక్కడకు రావడం జరిగిందని తెలిపారు

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కేసు

గుంటూరు ఈస్ట్: హోటల్ యజమాని, తన హోటల్‌లో పనిచేస్తున్న మహిళా కూలీ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శివరామ్‌నగర్‌లో ఓ హోటల్ యజమాని ఖాశిం తన అనుచరులు మున్నా, ఈసుబ్లతో హోటల్‌లో సమీపంలో నివాసం ఉండే మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించారు. బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు సహకరించండి



నెహ్రూ నగర్ : రహదారి ప్రమాదాల నివారణకు వాహనాలకు తప్పనిసరిగా రెఫ్లెక్టివ్ టేపులు అంటించాలని డీటీసీ షేక్ కరీం వాహనదారులకు సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా రెఫ్లెక్టివ్ టేపులు పై ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయంలో రవాణా వాహనాలు, ఇతర వాహనాలకు రెఫ్లెక్టివ్ టేపులు అంటించడం ద్వారా వెనుక వచ్చే వాహనాలను గుర్తించి ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో అధికారులు ప్రసాద్, గోపాల్, మల్లీశ్వరి, అనిల్ కుమార్, విజయ సారధి పాల్గొన్నారు.

ఆర్థిక పరిపుష్టికి ఆసరా

- డ్వాక్రా మహిళలకు వరం వైఎస్సార్ ఆసరా పథకం
- నాలుగో విడత రుణమాఫీ రూ.34.17 కోట్లు విడుదల
- పొన్నూరు నియోజకవర్గంలో 40.888 మంది మహిళలకు లబ్ధి
- ఇచ్చిన హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి
- హర్షం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు



పొన్నూరు 30వ వార్డులో గ్రూపు సభ్యుల సమావేశం

పొన్నూరు: మహిళా సాధికారత, స్వావలంబన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారు. అన్నింటా అండగా నిలుస్తూ చేయూత అందిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణమాఫీని వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అమలుచేస్తూ మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారు. డ్వాక్రా మహిళలకు ఓ పక్క సున్నావడ్డీకి రుణాలు అందించడంతో పాటు రుణాలను మాఫీ చేసి సంక్షేమానికి పాటు పడుతున్నారు. 2019 ఏప్రిల్ నాటికి డ్వాక్రా సంఘాలకు ఉన్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని సీఎం వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. మహిళలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఇప్పటికే మూడు విడతల రుణమాఫీ చేశారు. చివరి విడత రుణమాఫీని మంగళవారం బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేశారు.

ఇచ్చిన మాట ప్రకారం పూర్తిగా రుణమాఫీ ..

ఈ రుణమాఫీని ఏప్రిల్‌లో అమలు చేయాల్సి ఉండగా ఎన్నికల నేపథ్యంలో ముందుగానే డ్వాక్రా మహిళల ఖాతాల్లో నగదును జమ చేసి ఇచ్చిన హామీని నెరవేర్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. పొన్నూరు నియోజకవర్గంలో డ్వాక్రా రుణమాఫీకి సంబంధించి నాలుగు విడతల్లో రూ.136.71 కోట్లను ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడంతో డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత మోసం చేశారని గుర్తు చేసుకుంటున్నారు. అయితే మహిళలకు ఇచ్చిన హామీలన్నింటినీ పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందని పేర్కొంటున్నారు.

నాలుగు విడతల్లో రూ.136.71 కోట్లు..

వైఎస్సార్ ఆసరా పథకం నాల్గో విడతకు సంబంధించి పొన్నూరు నియోజకవర్గంలోని 4157 డ్వాక్రా గ్రూపులకు రూ.34.17 కోట్లు వారి ఖాతాల్లో నగదు జమచేశారు. మొత్తం నాలుగు విడతల్లో రూ.136.71 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు మెప్మా అధికారులు తెలిపారు.

నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా అమలు తీరు..

మండలం	గ్రూపుల సంఖ్య	లబ్ధి (రూ. కోట్లలో)
పొన్నూరు	1475	52.43
చేబ్రోలు	1354	40.56
పెదకాకాని	1328	43.73
మొత్తం	4157	136.71

రూ. 58 వేలు లబ్ధిపొందాను



ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణమాఫీ అమలు చేయడంతో ఇప్పటివరకు నాలుగు విడతల సాయం అందింది. మా గ్రూపునకు రూ. 5.80 లక్షల రుణమాఫీ అయింది. రూ.14,450 చొప్పున నాలుగు విడతల్లో రూ. 58 వేలు నాకు అందింది. నాలుగో విడత అందించిన సాయంతో పూర్తిస్థాయిలో రుణ మాఫీ జరిగింది. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేసిన జగనన్నకు ధన్యవాదాలు.

– బుర్రా వరలక్ష్మి, గ్రూపు సభ్యురాలు

నాలుగు విడతల్లో రూ.39.04 కోట్లు జమ



వైఎస్సార్ ఆసరాకు సంబంధించి పొన్నూరు పట్టణంలో 976 గ్రూపులకు నాలుగో విడతలో రూ.9.82 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. నాలుగు విడతల్లో కలిపి రూ.39.04 కోట్లు ప్రభుత్వం అందించింది. ఆఖరి విడతగా అందిస్తున్న రుణమాఫీ నగదు వారం రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుంది.

– ఎం.ఎం.జ్యోత్స్న, సీఎంఎం మెప్మా, పొన్నూరు

బీసీ సాధికారతకు సీఎం జగన్ పెద్దపీట

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్
- జొన్నలగడ్డలో గుండె గుండెకు జగనన్న- గడప గడపకు కిరణన్న నిర్వహణ



స్థానికులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న సమన్వకర్త కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బడుగు బలహీనవర్గాల వారు వెన్నెముకని, బీసీ సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం రూరల్ మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో గుండె గుండెకు జగనన్న...గడప గడపకు కిరణన్న కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త కిరణ్‌కుమార్‌కు స్థానికులు స్వాగతం పలికారు. సమన్వయకర్త ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. ఆడబిడ్డల మోములో చిరునవ్వులు చూసేందుకు తోడుగా సీఎం వైఎస్ జగన్ ఉన్నారని, దానికి నిదర్శనమే వైఎస్సార్ ఆసరా నాల్గో విడత పంపిణీయని పేర్కొన్నారు. 2014 సంవత్సరానికి ముందు చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి నిండా ముంచారని, ఆ సమయంలో బ్యాంకులకు వడ్డీలు కట్టలేక డిఫాల్టర్లుగా మహిళలు మారారని గుర్తు చేశారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి బ్యాంకులో రుణాలన్నీ మాఫీ చేస్తున్నారని గుర్తు చేశారు. దీంతో బ్యాంకుల్లో డ్వాక్రా మహిళల పరపతిని పెరిగిందని అన్నారు. జొన్నలగడ్డపై అడుగుపెట్టినప్పుడు ఇక్కడ ప్రజలు చూపిన ఆదరాభిమానాలు ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. కష్టాలు దరిచేరకుండా కాపు కాసేందుకే సీఎం వైఎస్ జగన్ కాపు నేస్తం తీసుకొచ్చారని, ప్రతి ఏటా పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా వారి ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నారని తెలిపారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, వివిధ సొసైటీల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు డైరెక్టర్‌లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, డివిజన్ల కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైవర్ల అప్రమత్తతతో రోడ్డు ప్రమాదాల నివారణ

- తెనాలి డివిజన్ ఆర్టీఓ ప్రసాద్
- ఘనంగా 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు



విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీఓ ప్రసాద్, తదితరులు

చేబ్రోలు: రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నా, ప్రయాణికులను సుఖంగా, భద్రంగా గమ్యం చేర్చాలన్నా డ్రైవర్ల అప్రమత్తతోనే సాధ్యమవుతుందని తెనాలి డివిజన్ ఆర్టీఓ ప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళవారం 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ ప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, సెల్ ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నేరాలను చేయకూడదన్నారు. విద్యాసంస్థలలో పనిచేసే డ్రైవర్లు మరింత అప్రమత్తతతో పాటు పరిమితికి మించి విద్యార్థులను బస్సు లోపలికి అనుమతించరాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూగానీ, అధిక వేగంతోగానీ బస్సులను నడుపరాదని హెచ్చరించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డ్రైవర్లందరూ మెడికల్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. ప్రాణం ఎంతో విలువైనదని, ఏ ఒక్కరూ కూడా రోడ్డు ప్రమాదాల్లో మరణించకూడదనే ఉద్దేశ్యంతో డ్రైవర్లకు అవగాహన కల్పించే విధంగా భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. బస్సుల్లో ప్రాథమిక చికిత్సకు సంబంధించిన కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బస్సు రన్నింగ్‌లో ఉన్నప్పుడు విద్యార్థులను ఎక్కడానికి, దిగడానికి అనుమతించుకూడదని తెలిపారు. ప్రతి ఒక్క డ్రైవర్ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. తెనాలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రాఘవరావు, ఎస్‌బీ మధుసూదన్‌రావు, జిల్లా రోడ్ సేఫ్టీ మేనేజర్ షేక్ సాదిక్, రోడ్ సేఫ్టీ డ్రైవింగ్ ట్రైనర్ జగదీష్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

'ఆర్‌వీఆర్'లో కొలరిడో పోస్టర్ ఆవిష్కరణ



కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: విద్యార్థుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో రెండు రోజులపాటు కొలరిడో పేరుతో జరగనున్న జాతీయస్థాయి పోటీల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతీయస్థాయి పోటీలు ఫిబ్రవరి 15-16 తేదీలలో జరుగుతాయన్నారు. కళాశాల ఆవరణలో జరిగే ఈ పోటీలలో విజేతలకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లను అందించటం జరుగుతుందన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ టెక్నికల్, సాంస్కృతికం, క్రీడల విభాగాలలో పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పోటీల్లో దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో వివిధ కళాశాలల విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పోటీలకు సంబంధించిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి కళాశాలకు చెందిన https://rvrjcce.ac.in/colorido2k24 వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, కార్యక్రమ కన్వీనర్ పొన్నం కిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయంలో పెయింటింగ్ పోటీలు



గుంటూరు రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలిసి తీసేందుకు పోటీతత్వాన్ని పెంచేందుకు పరీక్షపే చర్చా కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ హనీమెహత పేర్కొన్నారు. మంగళవారం నల్లపాడు గ్రామంలోని కేంద్రియ విద్యాలయంలో పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పెయింటింగ్ నైపుణ్యతలను మెరుగు పరిచేందుకు పోటీలను నిర్వహించారు. కేంద్రియ విద్యాలయ సంఘటన్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ డి.మంజునాథ్ నేతృత్వంలో జరిగిన ఈ పోటీలకు జిల్లాలోని 16 పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో నైపుణ్యతలు ప్రదర్శించిన విద్యార్థులు ఐదుగురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడకు చెందిన ఫైన్ ఆర్ట్స్ స్కూల్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ పి.సంతోష్‌కుమార్, ఏపీ సోషల్ వెల్ఫేర్ స్కూల్ ఆర్ట్స్ టీచర్ మోహన్‌రాజు, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఆర్ట్స్ టీచర్ వి.వీరయ్యలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు స్వాతంత్ర్య సమరయోధుల జీవితగాథల పుస్తకాలు బహుమతిగా అందజేశారు. ఉపాధ్యాయులు టి.ప్రసన్న, టీఎం రావు, మిలన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి ఘటనలో కేసు నమోదు

గుంటూరు ఈస్ట్ : పాత కక్షల నేపథ్యంలో సమీప బంధువుపై దాడిచేసిన వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటీ అగ్రహారానికి చెందిన ఎ.దుర్గారావు, వెంగళాయపాలెంకు చెందిన దేరంగుల గోపిలు సమీప బంధువులు. పాత గొడవల నేపథ్యంలో దుర్గారావు మంగళవారం ఏటీ అగ్రహారంలో గోపిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ మమత

పెదకాకాని: గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని లక్షణాలు గుర్తించిన వెంటనే తగిన పరీక్షలు, చికిత్స చేయించుకుని ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని ఆస్టర్ రమేష్ హాస్పటల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహించిన గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన సదస్సుకు డాక్టర్ మమత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రాయపాటి మమత మాట్లాడుతూ గుండెకు రక్త సరఫరా పూర్తిగా అందకపోవడం వలన స్ట్రోక్స్ సంభవిస్తాయని, స్ట్రోక్స్ అన్ని వయసుల వారికి సంభవించవచ్చన్నారు. వాటి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. బలహీనత, తీవ్రమైన తలనొప్పి, నడకలో ఇబ్బంది వంటి లక్షణాలు గమనించిన వెంటనే వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పటల్‌లో పూర్తిస్థాయిలో గుండె పనితీరును అంచనా వేయగల ఆధునిక రోగనిర్ధారణ పరీక్ష పరికరాలు, సీటీసీఏజీ వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.మహ్మద్‌ఖాన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విజ్ఞాన మందిరంలో సంగీత విభావరి

పాత గుంటూరు: ఏకే కల్చరల్ అసోసియేషన్ పదో వార్షికోత్సవం పురస్కరించుకొని రాజా గారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు అమానుల్లా ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రముఖ గాయకులు సినీ పాటలను ఆలపించనున్నట్లు చెప్పారు. అనంతరం జరిగే సభలో మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్‌కు సత్కారం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి సంగీతాభిమానులు హాజరు కావాలని కోరారు.

25,26 తేదీల్లో 'జగన్నామ సంక్షేమ సంగమం' శిబిరాలు

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- చేబ్రోలు పాత పోలీస్ స్టేషన్ పక్కన, చేబ్రోలు - ముట్లూరు జంక్షన్ వద్ద ఏర్పాటు
- సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు పిలుపు



చేబ్రోలు: సంక్షేమ సారధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపరను కొనసాగిస్తున్నామని దీనిలో భాగంగా మండల కేంద్రమైన చేబ్రోలులో రెండు రోజుల పాటు జగన్నామ సంక్షేమ సంగమం శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా పలు గ్రామాలలో నిర్వహించిన సంక్షేమ సంగమ శిబిరాలకు అనూహ్య రీతిలో స్పందన లభించిందని వివరించారు. ఇదే క్రమంలో చేబ్రోలులో ఈ నెల 25న పాత పోలీస్ స్టేషన్ పక్కన, 26న చేబ్రోలు - ముట్లూరు రోడ్డు జంక్షన్‌లో రెండు రోజుల పాటు బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజరంగ్ 'జగన్నామ సంక్షేమ సంగమం' శిబిరాలను ఏర్పాటు చేయడం జరరుగుతుందని తెలిపారు. ఈ శిబిరాలలో బజరంగ్ - నేత్ర జ్యోతి, బజరంగ్ - మీ గుండె పదిలం, బజరంగ్ - దివ్యాంగదర్శిని మరియు ఫిజియోథెరపీ సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. నేత్రజ్యోతి శిబిరంలో కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి వారం రోజుల్లో ఉచిత కళ్లజోడు అందించడం, మీ గుండె పదిలం శిబిరంలో గుండె సంబంధిత సమస్యలు గుర్తించి అవసరమైన వారికి యాంజియోగ్రామ్‌లు, తదుపరి గుండె సర్జరీలు చేయించడం, స్టెంట్లు వేయించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో అవసరమైన వారికి ఫిజియోథెరపీ సేవలు కూడా ఈ శిబిరంలో అందించడం జరుగుతుందన్నారు. గ్రామంలోని దివ్యాంగులకు ఉచితంగా త్రిచక్ర వాహనం, జైపూర్ కాలు, వెస్టన్ కమోడు సమకూర్చడం జరుగుతుందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు మద్దతుగా బజరంగ్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన విస్తరిస్తూ ప్రజల సౌకర్యార్థం ఈ సేవలను ప్రజల ముంగిట్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంబటి మురళీకృష్ణ సూచించారు.

'ఆడుదాం ఆంధ్రా' ప్రతిష్టాత్మకం

- గుంటూరు ఆర్డీఓ పి. శ్రీకర్
- నియోజకవర్గ స్థాయి పోటీలపై సమీక్ష



పీడీలు, పీఈటీలతో మాట్లాడుతున్న గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్

ప్రత్తిపాడు: పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నేటి నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి ఆటల పోటీలపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలతో మాట్లాడారు. పోటీల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు, ఏర్పాట్లపై చర్చించారు. ఏ పోటీలు ఎక్కడ నిర్వహిస్తున్నారు? ఎంత మంది క్రీడాకారులు హాజరవ్వనున్నారు? తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలపై పీడీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీకర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మేలైన క్రీడాకారుల ప్రతిభ బయటకొస్తుందన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పోటీలను గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహిస్తుందని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నియోజకవర్గస్థాయి పోటీలు..

పొన్నూరు: పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ నేటి నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పీబీఎన్ కళాశాలలో క్రికెట్ పోటీలు, నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతాయని తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని కోరారు.

నేతాజీ నేటితరానికి ఆదర్శనీయుడు

సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నివాళులర్పించిన సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



నేతాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: దేశ ప్రజల దాస్య శృంఖలాలను తెంచి దేశానికి స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు కృషిచేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఏటుకూరు రోడ్డులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో నేతాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సమన్వయకర్త మాట్లాడుతూ ఆజాద్ హింద్‌ఫౌజ్‌కు రూపకల్పన చేసి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహా నాయకుడు నేతాజీ అని తెలిపారు. ఆయన ధైర్యసాహసాలు, సంకల్పదీక్ష ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమన్నారు. నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, కార్పొరేటర్లు, సొసైటీల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

హెచ్‌డీ పత్తి సాగుపై దృష్టి పెట్టండి

డీడీఏ రామాంజనేయులు



పంట పొలాలను పరిశీలిస్తున్న రిసోర్స్ సెంటర్ డీడీఏ రామాంజనేయులు

ప్రత్తిపాడు: హెచ్‌డీ పత్తి సాగుపై రైతులు దృష్టి సారించాలని డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ డీడీఏ రామాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడులో మంగళవారం గ్రామ విత్తన పథకం కింద రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద మండలంలోని గొట్టిపాడు, వంగిపురం రైతులకు ఈ ఏడాది సీజన్ ఆరంభంలో రైతులకు ప్యూరిటీ విత్తనాలను అందజేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత రైతులకు శిక్షణనిచ్చారు. పంట సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ పద్ధతులు, అవలంభించాల్సిన విధానాలపై రైతులకు వివరించారు. రైతులు హెచ్‌డీ కాటన్ సాగుపై ఆలోచించాలన్నారు. ఈ రకం సాగు వలన రెండు తీతల్లోనే దిగుబడి చేతికి వస్తుందని, మామూలు రకాల వలన మూడు పత్తి తీతలు పడుతున్నాయని, దీని వలన ప్రకృతి విపత్తుల సమయంలో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఏఓ రాజవంశి, ఏరువాక శాస్త్రవేత్త ఎం.నగేష్, ఏఓ అరుణకుమారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.